క్లుప్తంగా

చిన్నారులకు చుక్కల మందు



విద్యార్థినికి చుక్కల మందు వేస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిలా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో మంగళవారం స్వర్ణామృత సంస్కార చుక్కల మందును పంపిణీ చేశారు. 6 నుంచి 12నెలల వయసు ఉన్న 200 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చకిలం బాలచంద్రం, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్, కృష్ణమూర్తి, ఆత్మారాములు, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండుటెండల్లోను పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మానకొండూర్‌లో 77.75 శాతం పోలింగ్ జరగడానికి కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్లను చైతన్యపరచడం కారణమన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థికి సన్మానం



సుత్రుత్‌ను సన్మానిస్తున్న నవ జీవన్ ఫౌండేషన్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఆకుల సుశ్రుత్ సీబీఎస్‌ఈలో మంచి మార్కులతో పాసవడంతో నవ జీవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఆకుల నరేష్‌బాబు మాట్లాడుతూ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల్లో సుశ్రుత్ 500లకు 491 మార్కులను సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, వంగాల రంగాచారి, హరిణపవన్, సావిత్రి, శ్రీప్రసన్నలక్ష్మీ, విష్ణు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ దరఖాస్తులు స్వీకరణ



బానోతు రాజన్న, ప్రిన్సిపాల్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బానోతు రాజన్న మంగళవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు మొదటి దశ అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులున్నాయన్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో విద్యాబోధన జరుగుతుందన్నారు.

వృథాగా భగీరథ నీరు



వరదలా ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ రోడ్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భగీరథ పైప్‌లైన్ పగిలింది. 200 మీటర్లకు పైగా నీరు ప్రవహిస్తుండంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డమీది రాజిరెడ్డిని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంగళవారం పరామర్శించారు. రాజిరెడ్డి కుమార్తె కస్తూరి లలిత అనారోగ్యంతో సోమవారం మరణించింది. విషయం తెలుసుకొని వారు ఘనపురం వెళ్లి రాజిరెడ్డిని పరామర్శించి ఓదార్చారు.

సాగుకు సలహాలు ఏవీ?

- పక్షం రోజుల్లో రోహిణీ కార్తె ప్రారంభం
- వానాకాలం పంటల సాగుకు రోహిణి కార్తె బలం
- నార్లు పోసేందుకు రైతులు సిద్ధం
- నల్లరేగడిలో తొలకరి వానలకే పత్తి పంట సాగు
- రైతులను భయపెడుతున్న నకిలీ విత్తనాలు



పందిల్లలో పత్తి సాగుకు పొలాన్ని సిద్ధం చేసిన రైతు

వానాకాలం సాగు పనులను రోహిణీ కార్తెలో మొదలు పెడితే పంటల దిగుబడులు ఎక్కువ వస్తాయని రైతులకు గట్టి నమ్మకం. వరి కోతలు పూర్తి కావడంతో సెలక పనులను చేసుకొని వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో 1.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే నకిలీ విత్తనాల బెడద రైతులను వేధిస్తోంది.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ మద్దూరు, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లో దాదాపు 1.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగుకు కావల్సిన విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందా? అని సందేహిస్తున్నారు. సకాలంలో అందకపోతే ప్రైవేటు విత్తనాల దుకాణంలో కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు విత్తన విక్రయదారులను ఆశ్రయిస్తే నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదం ఉందంటున్నారు. వరి, మొక్కజొన్న, కందులు, పత్తి విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తే నాణ్యమైన విత్తనాలు అందడంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నల్లరేగడి నేలలో పత్తి సాగు

హుస్నాబాద్ మెట్ట ప్రాంతంలో నల్లరేగడి నేలల్లో ఎక్కువగా పత్తి పంటలను సాగుచేస్తారు. రైతులు వేసవి దుక్కులను సిద్ధం చేసుకొని తొలకరి వానలకే పత్తి విత్తనాలు విత్తుతారు. భారీ వర్షాలు కురిస్తే 15 రోజుల వరకు నల్ల రేగడిలో విత్తనం పెట్టడానికి వీలుపడదని, విత్తనాలను ముందుగానే తెచ్చి పెట్టుకుంటారు. హుస్నాబాద్ మండలంలోని బంజేరుపల్లి గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పత్తిసాగు చేస్తారని విత్తన వ్యాపారులు ముందే వీరి గ్రామాలకు వచ్చి విత్తనాలను విక్రయిస్తారు. మోతుబరి రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇచ్చినప్పటికీ చిన్న, సన్నకారు రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతుంటారు. ఫిబ్రవరి 24వ తేదీన మహ్మదాపూర్ గ్రామంలో 14 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వ్యాపారులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ విత్తన విక్రయదారులు ముందుగానే విత్తనాలను నిల్వ చేసుకొని వర్షాలు కురియగానే రైతుల అవసరాలను ఆసరా చేసుకొని వారికి విక్రయిస్తారు. విత్తనం దొరికిందనే సంతోషంలో రైతులు దుక్కిదున్ని విత్తనం నాటతారు. అవి మొలకెత్తకపోతే మళ్లీ విత్తనం నాటడానికి అప్పులు చేస్తారు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తే నాణ్యమైన విత్తనం అందే అవకాశం ఉంటుంది.



మహ్మదాపూర్‌లో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

సబ్సిడీపై పత్తి విత్తనాలు అందించాలి



పత్తి పంట సాగు పెట్టుబడి పెరుగుతోంది. ప్రభుత్వం పత్తి విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి లేదా పత్తి పంటను సాగు చేసిన రైతులకు విత్తన ఖరీదులో 50 శాతం సబ్సిడీని రైతుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తే విత్తన భారం ఉండదు. మా ప్రాంతంలో నల్లరేగడి భూములున్నాయి. వెయ్యి ఎకరాల్లో పత్తి పంట సాగుచేస్తారు. కూలీల కొరత కూడా ఉంటుంది. సబ్సిడీ యంత్రాలను కూడా అందించాలి.

– బాలస్వామి, బంజేరుపల్లి

అందరూ ఎన్నికల విధుల్లోనే..



వానాకాలం సాగుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. రోహిణీ కార్తెలో నార్లు పోసుకుంటే పంట దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. భారీ వర్షాలు పడితే కానీ, రైతులు విత్తనం వేయడానికి ముందుకురారు. నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలని ఏఈఓల ద్వారా సలహాలు ఇస్తున్నాము.

– మహేశ్, ఏడీఏ, హుస్నాబాద్

ఆపత్కాలంలో పొదుపు ఆసరా

విధాత పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

కొండపాక(గజ్వేల్): ఆపత్కాలంలో పొదుపు ఎంతో ఆసరాగా నిలుస్తుందని విధాత పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు ఊడెం తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో మృతి చెందిన సంఘం సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి కుమారుడికి సంఘం కార్యాలయంలో అభయనిధి పేరిట రూ.29 వేల నగదును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల కిందట పొదుపు సంఘాన్ని ప్రారంభించామన్నారు. సభ్యత్వం తీసుకున్న సభ్యుడికి బీమా చేశామని తెలిపారు. ప్రమాదాలు, ఆకస్మిక మరణం సంభవిస్తే సంఘం సభ్యులకు పొదుపు సొమ్ములో కొంత అభయనిధి పేరిట కుటుంబాలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మర్యాల రవీందర్, పర్యవేక్షకులు టి.మల్లేశం, పాలక వర్గం సభ్యులు గఫూర్, కనకయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



మర్పడ్గలో అభయనిధి నగదును అందజేస్తున్న అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

బీఆర్‌ఎస్ నేతల దాడి అమానుషం

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): బలప్రయోగంతో రాజ్యమేలాలని చూస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్యనాయకుల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కామెడీ జీవన్‌రెడ్డి, బక్కిరెడ్డి సుదర్శన్ మాట్లాడారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనుచితంగా ప్రవర్తించిన బీఆర్‌ఎస్ నాయకులను రాష్ట్ర యువ నాయకుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ప్రశ్నిస్తే ఆయనపై దాడి చేయడం అమానుషమన్నారు. స్థానికుల మధ్య విబేధాలు సృష్టించి, భౌతిక దాడులకు పాల్పడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరులపై ఎలక్షన్ కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముత్యాల మనోహర్, నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు జీవన్‌రెడ్డి

భగీరథుడి అడుగుజాడల్లో నడవాలి



రామాయంపేటలో భగీరథ జయంతిలో పాల్గొన్న సగర సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): భగీరథ మహర్షి అడుగుజాడల్లో ప్రజలు నడవాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కు దత్తు పేర్కొన్నారు. పట్టణంలో సగర సంఘం సభ్యులు మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వివేకానంద, అంబేడ్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ వీలైనంత మేర సమాజసేవ చేయాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం రెండు బేడల అధ్యక్షులు నాగభూషణం, మర్కు భూమయ్య, కోశాధికారులు సురేశ్, రామారావు రమేశ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మహర్షి భగీరథ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉప్పర సంఘం ఆధ్వర్యంలో మహర్షి భగీరథ మహారాజ్ చిత్రపటానికి పూజ చేశారు. భగీరథుడు మానవాళికి చేసిన ఉపకారం వెలకట్టలేనిదన్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు

- అపరిశుభ్రంగా డబుల్ బెడ్రూం కాలనీ
- చెత్తా చెదారంతో మురుగు కాల్వలు
- దుర్వాసనతో స్థానికులకు ఇక్కట్లు



దుబ్బాక డబుల్ బెడ్రూం కాలనీలో పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం, గడ్డి, దట్టంగా పెరిగిన ముళ్ల పొదల కారణంగా మురికి నీరు పారుదల నిలిచి పోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. పట్టణంలోని బల్వంతాపూర్ రోడ్‌లో జీ ప్లస్ టూ కింద సుమారుగా 800 ఇండ్లు నిర్మించారు. దీంతో ఈ కాలనీలో సుమారుగా 3 వేలకుపైగా ప్రజలు నివసిస్తున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మించిన వ్పటి నుంచి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు రోడ్ల మీదే పారుతోంది. వర్షం కురిస్తే పరిస్థితి మరింతగా దయనీయంగా ఉంటుంది. కాలనీవాసులు మురుగు నీటిలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు కాల్వలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో చెత్త నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీనికి దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయించాలని వేడుకుంటున్నారు.

సమస్య పరిష్కరించండి

దుబ్బాక డబుల్ బెడ్రూం కాలనీలో డ్రైనేజీలు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– శ్రీరాం నరేందర్, కాంగ్రెస్ నాయకుడు

లాఠీచార్జి హేయమైన చర్య

టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



సిద్దిపేటలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ఇతర పార్లమెంట్ నియోజకవర్గంలో చెల్లించిన విధంగా టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు వారిపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలిఅహ్మద్, ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు నిబంధనల మేరకు చెల్లించాల్సిన టీఏ, డీలు చెల్లించాలని ఆర్డీఓ కార్యాలయ అధికారులను కోరగా వారు పోలీసులతో లాఠీచార్జి చేయించారని ఆరోపించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ట్రావెలింగ్ అలవెన్స్ అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వ నిబంధనల మేరకు టీఏ, డీఏలు చెల్లించాలన్నందుకు ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయడం దారుణమని మండిపడ్డారు. లాఠీచార్జి చేయాలని ఆదేశించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

లాఠీచార్జ్ అమానుషం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని టీఎస్‌యూటీఎఫ్ ఖండిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకటకిరణ్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని ఈనెల 11వ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 691 విడుదల చేసిందన్నారు. పీఓ, ఏపీఓలకు రోజుకు రూ.600, ఓపీఓలకు రూ.400 చొప్పున పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ.3150 చెల్లించగా, నారాయణఖేడ్‌లో రూ.2400 మాత్రమే చెల్లించారన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యునరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారన్నారు. ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. లాఠీచార్జి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని సంఘం జిల్లా కార్యదర్శితో పాటు జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు శివుడు, ప్రధాన కార్య దర్శి రాజనర్సింహులు, జిల్లా నాయకులు రాంచంద్రం, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, ఎస్ఎండీ మహబూబ్‌పాష డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడి సస్పెన్షన్



మాట్లాడుతున్న దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామి గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అక్బర్‌పేట-భూంపల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గజబింకార్ అశోక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్ ప్రకటించారు. మంగళవారం అక్బర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా అశోక్ ప్రచారం చేసినట్లు నిర్ధారణ కావడంతో పార్టీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై ఆయనకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర అధిష్టానానికి మండల తీర్మాన లేఖ పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోతారం ఎంపీటీసీ మంద చంద్ర సాగర్, మండల మహిళా అధ్యక్షురాలు కూతురు సుమలత, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, మధు, టెలికం బోర్డు మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, ఫిషర్ మెన్ మండల అధ్యక్షుడు చందు, మండల నాయకులు బొమ్మెర శ్రీధర్, మల్లేశం, నరేష్, రవీందర్‌రెడ్డి, జగన్, నర్సింహారెడ్డి, బాలాగౌడ్, యాదవరెడ్డి, భిక్షపతి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో విజయం ఖాయం

కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం చిట్కుల్‌లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ నుంచి తనను పోటీలో నిలిపిన ఏఐసీసీ అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నికుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీదే విజయమని స్పష్టంచేశారు. నీలం మధును కలిసినవారిలో జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ అక్కారం సత్తయ్య, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పొత్కుల వెంకటేశం, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు, లింగాపూర్ మాజీ సర్పంచ్ కొత్తపల్లి సత్తయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వలపు సత్యనారాయణ ఉన్నారు.



నీలం మధును కలిసిన ముదిరాజ్ నాయకులు

గోమారంలో వైభవంగా మహాయాగం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో చతుర్వేద హవనం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 12 నుంచి 17 వరకు లోక కల్యాణం కోసం శ్రీ వేద మాత అనుగ్రహంతో చతుర్వేద హవనం చేస్తున్నారు. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ ద్వివేది వైదిక నిర్వహణలో పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అర్చకులు శాస్త్రుల అయోధ్య రామశర్మ, చండిక శర్మలు ప్రముఖులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ప్రమాదకరంగా రోడ్డుపై ధాన్యం కుప్పలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రహదారిపై వరి ధాన్యం కుప్పలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని చిన్నగొట్టిముక్ల – జీడిపల్లి, నర్సాపూర్ – వెల్దుర్తి, తూప్రాన్ – వెల్దుర్తి ప్రధాన రహదారులపై ఆయా గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం ఆరబోయంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబోసి రాళ్లు పెట్టడంతో ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద కుప్పలు ఉండటంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై కల్లాలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



చిన్నగొట్టిముక్కల- జీడిపల్లి దారిలో ధాన్యపు రాశులు